బోథ్ ఎమ్మెల్యేను కలిసిన అర్లి గ్రామస్తులు

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను శాలువాతో సన్మానిస్తున్న అర్లి గ్రామస్తులు

భీంపూర్, డిసెంబర్ 17 : భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామ బీఆర్ఎస్ నాయకులు, రైతులు ఆదివారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలన్నారు. అర్లి(టీ) చెరువు తదితర అభివృద్ధి పనులు తప్పక సాకారం అయ్యేలా చూస్తానని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గొల్లి లస్మన్న, దేశ్ ముఖ్, రాకేశ్, రుద్ర గంగయ్య ఉన్నారు.

కొజ్జన్‌గూడకు బోరు

భీంపూర్, డిసెంబర్ 17 : భీంపూర్ మండలంలోని కొజ్జన్‌గూడవాసులకు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. పెన్‌గంగ ఒడ్డున ఉన్న గ్రామానికి అదనంగా తాగునీటి బోరు అవసరమని గిరిజనులు గతంలో జాదవ్ అనిల్‌ను కోరారు. ఆ మాట ప్రకారం ఆదివారం గ్రామంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు దగ్గరుండి బోరు వేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌యాదవ్, గంగారాం, ప్రవీణ్, వాసుదేవ్, సర్పంచ్‌లు రేఖ, ప్రతాప్, ఉపసర్పంచ్‌లు నైతం సంజీవ్, కొక్కెరి నర్సింహులు,

కొజ్జన్‌గూడలో బోరు వేస్తున్న సిబ్బంది

అనిల్ యువసేన ప్రతినిధులు ప్రవీణ్‌యాదవ్, పెందూర్ లక్ష్మణ్, బండు, ఆకాశ్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే

- జనవరి 10వ తేదీ వరకు నిర్వహణ
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ
- వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని నిర్దేశం

తాంసి మండలంలో సర్వే చేస్తున్న సీఆర్పీలు

తాంసి, డిసెంబర్ 17: బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈ నెల 10 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 10 వరకు బడి బయట పిల్లలను గుర్తించిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు ప్రబంధ్ పోర్టల్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ప్రతి కాంప్లెక్స్ పాఠశాల పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు (సీఆర్పీలు) ఈ బాధ్యతలు అప్పగించారు. తాంసి మండలంలో 7 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 4 ఉన్నత పాఠశాలలు, బాలుర ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి.

సీఆర్పీలు తమ పరిధిలోని గ్రామాల్లో

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సును బట్టి ఆయా స్థాయి పాఠశాలల్లో చేర్పించేందుకు సంసిద్ధం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం నిర్వహించిన సర్వేలో దాదాపు 20 మంది పిల్లలను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీరందరిని సమీపంలోని పాఠశాలల్లో చేర్పించారు. సర్వేలో 6 నుంచి 14, 15 నుంచి 19 ఏండ్ల పిల్లలను గుర్తించి విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో రోజు వారి వివరాలు నమోదు చేయనున్నారు.

మూడు స్థాయిల్లో గుర్తింపు..

బడి బయట పిల్లలను గుర్తించేందుకు మండల వ్యాప్తంగా, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియన్ పరిధిలోని సీఆర్పీలు, ఐఈఆర్పీలు, డీఎంఎల్టీలు సర్వే ప్రారంభించారు. వీరు సేకరించిన సమాచారాన్ని మొదటి స్థాయిలో ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయుడు, రెండో స్థాయిలో మండల విద్యాధికారి, మూడో స్థాయిలో జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో జరుగనున్నది. ఈ క్రమంలో చేపట్టిన సర్వేల్లో బడి బయట పిల్లల గుర్తింపు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీరిని పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

పకడ్బందీగా బడి బయట పిల్లల సర్వే..

మండల పరిధిలో పకడ్బందీగా బడి బయట పిల్లల సర్వే చేపడుతున్నాం. సీఆర్పీలు, ఐఈఆర్పీలు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ఈ నెల 10 నుంచి నెల రోజుల పాటు సర్వే నిర్వహిస్తూ బడి ఈడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించడం, డ్రాప్ అవుట్లను గుర్తించడం, బడి బాట పట్టని వారిని గుర్తించి బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. సర్వే, ఇతర విద్యా విషయాల కార్యాచరణ, సన్నద్ధతపై సమావేశం నిర్వహించాం.

- డీ శ్రీకాంత్, మండల విద్యాశాఖాధికారి, తాంసి

శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పూజలు చేస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 17: ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామంలో పద్మావతి అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, జోగు రవి, దేవేందర్, కృష్ణ, గంగాధర్, బుచ్చన్న, లక్ష్మి, శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గొడం గణేశ్‌కు సన్మానం

గణేశ్‌ను సన్మానిస్తున్న తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్

ఎదులాపురం, డిసెంబర్ 17 : తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా గొడం గణేశ్‌ను శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈడబ్ల్యూసీఏ రాష్ట్ర నాయకుడు దేవేందర్, ప్రచారకార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బోథ్‌లో ఎమ్మెల్యే సమావేశం

బోథ్, డిసెంబర్ 17: బోథ్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారిగా క్యాంపు కార్యాలయానికి వస్తున్న సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 17 : ఆదిలాబాద్‌లోని సెంట్రల్ గార్డెన్‌లో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యల పరిష్కారం దిశగా ముందుకెళ్లాలని అన్నారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వర్ రెడ్డి, నరేందర్, నారాయణరెడ్డి, దేవీదాస్, డాక్టర్ ప్రీతి, సుధీర్, భూమన్న పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రంగంలో రాణించాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 17 : మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తూ కుటుంబాలకు అండగా నిలవాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ సూచించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మగ్గం, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఆదిలాబాద్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మూడు నెలల పాటు మహిళలకు అందించనున్న శిక్షణను ప్రారంభించారు. మహిళలకు కోర్సుకు సంబంధించిన వివరాలు తెలిపారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్, స్వప్నిల్, టీచర్స్ పెందూర్ లక్ష్మి, అందుగుల శ్రావణి, పూజ రాథోడ్, ఓరుగంటి వీణ, మెట్పల్లి హరీశ్, సతీశ్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ యాదవ్

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

నిర్మల్, డిసెంబర్ 17: పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని భీంపూర్ పీహెచ్‌సీ హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం పాలోడి గ్రామంలో గ్రామస్తులకు సిబ్బందితో కలిసి ఆరోగ్యసూత్రలపై అవగాహన కల్పించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో ప్రయోజనం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది సరస్వతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబర్ 17 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని నేరడిగొండలోని దర్శన్ జిన్నింగ్ మిల్లులో రెండు రోజుల పాటు సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి దేవన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం సంభవించిన్నందున సోమ, మంగళ వారాల్లో కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు. బుధవారం పున:ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఎదులాపురం, డిసెంబర్ 17 : ఆదిలాబాద్‌లోని టీచర్స్ కాలనీలో శనివారం రాత్రి అనిల్ చల్లావార్ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహాపడిపూజను నిజామాబాద్ జిల్లా అర్మూర్‌కు చెందిన సుబ్బారావు గురుస్వామి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై అయ్యప్ప దీక్షాపరులతో కలిసి పూజలు చేశారు. వార్డు కౌన్సిలర్ కృష్ణ యాదవ్, కాలనీ వాసులు, వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

ఎదులాపురం,డిసెంబర్17: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ, జిల్లా కేంద్రంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, చిలుక దేవీదాస్, మెస్రం భాస్కర్, పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు, పెద్ది నర్సింహులు పాల్గొన్నారు.